

హేమకుమార్ (ఫైల్‌ఫొటో)

మరణించినా.. ఆ నలుగురిలో..!

● బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి నుంచి గుండె, లివర్, కిడ్నీల సేకరణ.. నలుగురికి అమర్చిన వైద్యులు

పూతలపట్టు, జనవరి 18: ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన తమ కుమారుడు ఇక తిరిగిరాడని తెలిసి తల్లడిల్లిపోయారు. ఆపై గుండె దిటవు చేసుకున్నారు. వైద్యుల సలహా మేరకు అవయవదానానికి అంగీకరించారు. ఆ యువకుడి నుంచి సేకరించిన గుండె, లివర్, కిడ్నీలను నలుగురికి అమర్చారు. ఇలా తాను మరణించినా.. ఆ నలుగురిలో ఉన్నారు 26 ఏళ్ల హేమకుమార్. ఇతడిది పూతలపట్టు పంచాయతీ సామనత్తం గ్రామం. తల్లిదండ్రులు భారతి, సుబ్రహ్మణ్యం. బీటెక్ వరకు చదివి చిత్తూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మూడురోజులక్రితం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరగా ఎం.బండపల్లె వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన హేమకుమార్‌ను కుటుంబీకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. వ్యవసాయ కూలీలైన అతడి తల్లిదండ్రులకు అవయవదానంపై డాక్టర్లు అవగాహన కల్పించారు. వారి అనుమతితో హేమకుమార్ అవయవాలను సేకరించారు. అలా సేకరించిన గుండెను గుంటూరుకు చెందిన 29 ఏళ్ల వ్యక్తికి తిరుపతిలోని శ్రీపద్మావతి హృదయాలయంలో అమర్చారు. లివర్‌ను గంగవరానికి చెందిన 53 ఏళ్ల మహిళకు.. ఒక కిడ్నీని పూతలపట్టు మండలంకు చెందిన 51 ఏళ్ల మహిళకు.. మరో కిడ్నీని నెల్లూరు జిల్లాకు చెందిన 37 ఏళ్ల మహిళకు అమర్చారు. ఈ ఆపరేషన్లు స్విమ్స్‌లోనే విజయవంతంగా నిర్వహించారు. అంతటి విషాదంలోనూ హేమకుమార్ తల్లిదండ్రులు తీసుకున్న త్యాగపూరిత నిర్ణయాన్ని పలువురు కొనియాడారు. గురువారం సాయంత్రం హేమకుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.



హేమకుమార్ కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న స్విమ్స్ సిబ్బంది


దొంగ ఓట్ల దడ

కేంద్ర ఎన్నికల సంఘం కొరడా చేతికి తీసుకోవడంతో జిల్లా అధికార యంత్రాంగం వణికిపోతోంది. అధికారంలో ఉన్న నేతల మాటలకు తల ఒగ్గి చేసిన పనులు వెంటాడతాయని గిరీషా సస్పెన్షన్ పాఠం చెబుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నర ఏళ్లుగా అధికార యంత్రాంగం, పోలీసులు పూర్తిగా స్వతంత్రతను కోల్పోయి వ్యవహరించారు. వైసీపీ నాయకులు చెప్పిందల్లా చేశారు. కేసులు పెట్టారు. అరెస్టులు చేశారు. అధికారంలో ఉన్నవారు తమను కాపాడతారనే నమ్మకంతోనే ఇందుకు తెగించారు. అయితే నేతలు చేసిన పాపం, తమకు శాపంగా మారుతుందని ఇప్పుడు భయపడుతున్నారు. మూడు నెలల్లో జరగనున్న ఎన్నికలను తలచుకుని గడగడ వణికిపోతున్నారు.

ఆంధ్రజ్యోతి, చిత్తూరు

ఐఏఎస్ అధికారి సస్పెన్షన్‌తో వణికిపోతున్న అధికార యంత్రాంగం

పాపం నేతలది.. శాపం తమకా అని ఆందోళన



ఇంతకాలం జరిగిందేమిటంటే..

వైసీపీ అధికారంలోకి వచ్చాక 2020 నుంచి 2021 దాకా స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరిగాయి. ఇవి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో జరుగుతాయి. రాష్ట్ర ఎన్నికల అధికారి ఉన్నప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం తరహా అధికారం, నియంత్రణ వారికి ఉండవు. దీంతో అధికార పార్టీ నేతలు చెప్పినట్టల్లా జిల్లా అధికారులు తలాడించారు. వీరు చెప్పినట్లు కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు పని చేశారు. దీంతో అధికార పార్టీ నేతలు రెచ్చిపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని సర్పంచి, ఎంపీటీసీ స్థానాలతో పాటు మున్సిపల్ వార్డులు అధికార పార్టీకి ఏకగ్రీవమయ్యాయి. ప్రత్యర్థులను నామినేషన్లు వేయనీకుండా దౌర్జన్యం చేశారు. ఇక, చిత్తూరు కార్పొరేషన్‌లోనూ 50లో 37 డివిజన్లను అధికారుల సహకారంతో ఏకగ్రీవం చేసుకున్నారు. జిల్లాలో సగానికిపైగా జడ్పీటీసీ స్థానాలూ ఏకగ్రీవమయ్యాయి. ఆ క్రమంలో దౌర్జన్యాలు, దాడులూ అనేకం జరిగాయి. వీటికి సహకరించిన అధికారులు, పోలీసులు, ఉద్యోగులపై చర్యలు లేకపోవడంతో వారిలో భయం అన్నది లేకుండా పోయింది. ఓ దశలో రాష్ట్ర ఎన్నికల అధికారి అయిన అప్పటి ఉమ్మడి చిత్తూరు కలెక్టర్ భరత్ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ రమేష్‌రెడ్డి, పలమనేరు డీఎస్పీ ఆరీఫుల్లా, పుంగనూరు సీఐ గంగిరెడ్డిని రాష్ట్ర ఎన్నికల సంఘం బదిలీ చేసినా అమలు కాలేదు. అది చూసి అధికారులు, ఉద్యోగుల్లో ఏ మూలో ఉన్న భయం కూడా పోయింది.

ఓటర్ల జాబితా తయారీలోనూ అవకతవకలు

ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గతేడాది నుంచీ ఓటర్ల జాబితా సవరణలు చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల అనుభవంతో.. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీలోనూ అధికారులు, ఉద్యోగులు వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. మృతులు, వలస వెళ్లిన వారి ఓట్లు తొలగించకపోవడం, స్థానికేతరుల పేర్లు జాబితాలో నమోదు చేయడం, జీరో డోర్ నెంబర్ల పేరిట పెద్ద సంఖ్యలో ఓటర్లు కొనసాగుతుండడం వంటివి సంభవించాయి. ఇలా.. అధికారుల సహకారంతో వైసీపీ నేతలు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆధారాలు సహా టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేశారు. వీటిని పరిష్కరించడంలో ఆయా స్థాయిల్లో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. 'నగరి నియోజకవర్గంలో వైసీపీ వాళ్లు ఒక్కొక్కరు 5కు మించి ఫాం7 దరఖాస్తు చేశారు. కుప్పం నియోజకవర్గంలో బీఎల్వోలు ఏకపక్షంగా వ్యవహరించారు. పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ ఏజెంట్లు లేకుండానే బీఎల్వోలు ఇంటింటి సర్వే చేశారు. అలాగే, ఇష్టానుసారం పోలింగ్ కేంద్రాలను మార్చారు. పూతలపట్టు నియోజకవర్గంలో పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలను పెంచారు' అంటూ టీడీపీ నాయకులు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేశారు. నగరిలో అయితే అందిన ఫాం6, ఫాం7 వివరాలు తమకు ఇవ్వడంలేదని టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. ఎక్కడా పరిష్కారానికి అధికారులు చొరవ చూపలేదు.

పోలీసులైతే మరీను..

జిల్లాలోని చాలా మంది పోలీసులు ప్రతిపక్షాలను అక్రమ కేసులతో తీవ్రంగా వేధించారు. కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో అత్యధికంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యాయత్నం కేసుల్ని నమోదు చేశారు. టీడీపీలో ఏమాత్రం యాక్టివ్ ఉన్నా పోలీసుల ద్వారా అధికార పార్టీ నేతలు కేసులను పెట్టించారు. ఇలా బరితెగించి మరీ చాలాచోట్ల ప్రవర్తించిన పోలీసులూ ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోలాగే అధికార పార్టీ నేతలు చెప్పినట్లు చేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందన్న వాస్తవాన్ని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు.

దేవుడా.. దేవుడా..!

ఓటర్ల జాబితా తయారీలో తప్పిదాలపై టీడీపీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. ప్రాథమిక పరిశీలనలో అవకతవకలు జరిగాయని గుర్తించిన ఈసీ లోతుగా పర్యవేక్షిస్తోంది. రెండు సమీక్షల్లో పలు జిల్లాల అధికారులకు హెచ్చరికలు చేసింది. ప్రతి ఫిర్యాదునూ పరిశీలిస్తున్నామని చెప్పింది. రెండున్నరేళ్ల కిందట జరిగిన సంఘటనను వదలకుండా గిరీషను సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో 'అధికారపార్టీకి అనుకూలంగా పనిచేశాం.. ప్రభుత్వం కాపాడుతుంది' అనే భావనలో ఉన్న చాలామంది అధికారుల్లో దడ మొదలైంది. ఐఏఎస్ అధికారికే అలాగైతే.. తమ పరిస్థితి ఏంటని అధికార పార్టీ నేతలకు సహకరించిన బీఎల్వోలు, వీఆర్వోలు, డీటీలు, తహసీల్దార్లు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 22వ తేదీన విడుదలయ్యే తుది ఓటరు జాబితాలో తప్పిదాలు అలాగే ఉంటే.. బాధ్యులైన వారు ఈసీ చర్యలకు గురికాక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. తమ చేత తప్పులు చేయించిన పాపం అధికార పార్టీ నేతలదైతే, శాపం తమకు తగులుతోందంటూ అధికార యంత్రాంగం ఆందోళన చెందుతోంది.

టీడీపీ హయాంలో మంచి పేరు తెచ్చుకున్న గిరీష

'టీడీపీ అధికారంలో ఉంటే అధికారులకు గౌరవం.. అధికారం ఉండేది. వైసీపీ ప్రభుత్వంలో ఏ స్థాయి అధికారి అయినా ప్రజాప్రతినిధులు చెప్పినట్లు చేయాల్సిందే. ఇలా తిరుపతిలో ఓ ప్రజాప్రతినిధి చెప్పినట్లు చేసినందుకే గతంలో మంచి అధికారిగా పేరు తెచ్చుకున్న గిరీష.. ఇప్పుడు బలి కావాల్సి వచ్చింది' అని అధికారులు 'ఆఫ్ ది రికార్డు'గా చెబుతున్నారు. టీడీపీ హయాంలో చిత్తూరు కలెక్టర్లు సిద్ధార్థజైన్, ప్రద్యుమ్న హయాంలో గిరీష జేసీగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. జిల్లాకు పెద్దఎత్తున వచ్చిన పరిశ్రమలకు, జాతీయ రహదారుల అభివృద్ధి, ఆర్వోబీల నిర్మాణాలకు సుమారు లక్ష ఎకరాల భూసేకరణ చేసి రికార్డు సృష్టించారు. రెవెన్యూ శాఖలో క్షేత్ర స్థాయి అధికారుల అలసత్వాన్ని ఏమాత్రం ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నారు. టీడీపీ హయాంలో ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి ఒత్తిడి లేకపోవడంతో అలా పనిచేయగలిగారని, ఇప్పుడు వైసీపీ నాయకులు అధికారులను స్వేచ్ఛగా పనిచేసుకునే అవకాశం ఇవ్వడం లేదని అంటున్నారు.

నేటి నుంచి కులగణన సర్వే

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 18: కులగణన సర్వే శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కుటుంబీకులు చెప్పే వివరాలనే నమోదు చేయాలన్నారు. ఎవరైనా కులంపేరు చెప్పడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే బలవంతం చేయొద్దన్నారు.

వైసీపీ ఇన్‌చార్జుల నియామకాల్లో భాగంగా గురువారం విడుదల చేసిన నాలుగో జాబితాలో జిల్లాకు చెందిన ఇద్దరిని అటు.. ఇటు మార్చారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జిగా.. డిప్యూటీ సీఎం నారాయణస్వామిని చిత్తూరు లోక్‌సభకు మార్చారు. ఈ జాబితాలో చోటుచేసుకున్న రెండు మార్పులూ దళిత నాయకులకు సంబంధించినవే కావడం చర్చనీయాంశంగా మారింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



నారాయణస్వామి



రెడ్డెప్ప

అటు.. ఇటు

● చిత్తూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా నారాయణస్వామి ● జీడీనెల్లూరు అసెంబ్లీకి ఎంపీ రెడ్డెప్ప

● దళిత స్థానాల్లోనే మార్పులు చేసిన వైసీపీ

డిప్యూటీ సీఎంపై నెగ్గిన అసమ్మతి పంతం

జీడీనెల్లూరు ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. జ్ఞానేందర్‌రెడ్డి, దయాసాగర్‌రెడ్డి వంటి బలమైన వ్యతిరేకవర్గం.. అడ్డంకులు సృష్టిస్తూ వచ్చింది. వీరికి జిల్లాకు చెందిన పెద్ద నేత అండ ఉండడంతో మరింత ఇబ్బందులు పెట్టారన్న విమర్శలున్నాయి. నారాయణస్వామికి టికెట్ ఇస్తే ఓడిపోతారని, కొత్త అభ్యర్థి అయితేనే గెలిపించుకుంటామని తేల్చి చెప్పారు. ఇంతజరిగినా నారాయణస్వామి అంటే సీఎం జగన్‌కు నమ్మకమని, ఆయనకు లేదా ఆయన కుమార్తె కృపాలక్ష్మికి కచ్చితంగా టికెట్ ఇస్తారనే ప్రచారమూ జరిగింది. ఈ క్రమంలో వారం రోజుల కిందట పార్టీ అధిష్ఠానం జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ కీలక నాయకులతో సర్వే చేసింది. అభ్యర్థిగా ఎంపీ రెడ్డెప్ప, కుతూహలమ్మ అక్క కుమారుడు రాజేష్‌లో ఎవరు అభ్యర్థి అయితే బాగుంటుందనే అభిప్రాయాలను సేకరించింది. చివరకు నారాయణస్వామి పేరు లేకుండా పోయింది. ఫైనల్‌గా ఇక్కడ రెడ్డి సామాజికవర్గం మాటే చెల్లుబాటైందన్న ప్రచారం జరుగుతోంది.

జీడీనెల్లూరుకు నాన్‌లోకల్

ఇక, చిత్తూరు ఎంపీగా రెడ్డెప్ప ఈ ఐదేళ్లలో తన ముద్ర వేయలేకపోయారు. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి నమ్మిన వ్యక్తిగా ఉంటూ వారితో పాటు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనడం తప్ప ఆయన స్వతంత్రంగా వ్యవహరించిందేమీ లేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇప్పుడు, నారాయణస్వామికి స్థానం చూపించేందుకు మాత్రమే ఈయన్ను జీడీనెల్లూరుకు పంపినట్లు తెలుస్తోంది. పుంగనూరుకు చెందిన ఈయన జీడీనెల్లూరుకు నాన్‌లోకల్ కిందికి వస్తారు. స్థానికంగా అభ్యర్థులున్నా అధిష్ఠానం బయటి ప్రాంత వ్యక్తికి టికెట్ ఇచ్చిన నేపథ్యంలో వైసీపీ క్యాడర్ ఏమాత్రం పనిచేస్తుందో చూడాల్సి ఉంది.

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 18: ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్, అదనపు అర్హతల నమోదుకు employment.ap.gov.in వెబ్‌సైట్ సేవలు పొందవచ్చని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఈ వెబ్‌పోర్టల్ పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, మేయర్ అముదతో కలిసి ఆవిష్కరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారికి లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబరు ఎస్ఎంఎస్ వస్తుందన్నారు. వారి అభ్యర్థనను జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఆమోదించాక ఎస్ఎంఎస్ ద్వారా ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు తెలియజేస్తామన్నారు.

హత్యకేసులో 11 ఏళ్ల జైలు శిక్ష


వీరేష్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

చిత్తూరు లీగల్, జనవరి 18: హత్యకేసులో ఓ ముద్దాయికి న్యాయమూర్తి 11 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. చిత్తూరు నగరం వరిగపల్లి వద్ద ఉన్న జేఎంసీ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూల్‌కు చెందిన రాములు, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా జూకూరువాసి వీరేష్ పనిచేస్తున్నారు. 2023 మే ఒకటో తేదీన మేడే సందర్భంగా కూలీలకు కాంట్రాక్టర్ సెలవు ఇచ్చారు. అదేరోజు రాత్రి కాంట్రాక్టరు కూలీలందరికీ భోజనం ఏర్పాటు చేశారు. ఆ భోజనం సక్రమంగా లేదని వీరేష్ చెప్పడంతో పక్కనే భోజనం చేస్తున్న రాములు అనే యువకుడు గొడవకు దిగారు. దీంతో కర్రతో రాములు తలపై వీరేష్ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే రాములును స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాములు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు చిత్తూరు రెండో పట్టణ పోలీసులు వీరేష్‌పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసు గురువారం ఫస్ట్ ఏడీజే కోర్టులో వాయిదా ఉండగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి రమేష్.. వీరేష్‌పై నేరం రుజువు కావడంతో 11 సంవత్సరాల జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ లోకనాథరెడ్డి వాదించారు.

పావలా వడ్డీ రీయింబర్స్‌మెంట్


చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

చిత్తూరు, జనవరి 18: ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోక ఇళ్లు కట్టుకోలేని మహిళలకు ప్రభుత్వం పావలా వడ్డీకే రుణాలకు సంబంధించిన వడ్డీ రీయింబర్స్‌మెంట్ మొత్తం రూ.3.39 కోట్లను 25,736 మంది ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని సీఎం జగన్ తాడేపల్లె నుంచి గురువారం వర్చువల్ విధానంలో బటన్‌నొక్కి ప్రారంభించగా, వీడియో ద్వారా కలెక్టరేట్ నుంచి పలువురు హాజరయ్యారు. కలెక్టర్ షన్మోహన్, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, జిల్లాపరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు, మేయర్ అముద, హౌసింగ్ పీడీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రప్పల్లె పంట పొలాల్లో గాయపడ్డ నెమలి



చౌడేపల్లె, జనవరి18: గాయపడి ప్రమాద స్థితిలో ఉన్న ఓ నెమలి ఎర్రప్పల్లె పంట పొలాల్లో రైతు సుబ్రహ్మణ్యరాజుకు దొరికింది. గురువారం శెట్టిపేట పంచాయతీ ఎర్రప్పల్లె సమీపంలో కాలు విరిగి లేవలేని స్థితిలో ఓ పెద్దనెమలి రైతు సుబ్రహ్మణ్యంరాజుకు కనిపించింది. గమనించిన ఆ రైతు కుక్కలు దాడి చేయకుండా రక్షించి, పశువైద్యధికారులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

చిరుత దాడిలో నాలుగు మేకల మృతి



ఐరాల(కాణిపాకం), జనవరి 18: ఐరాల మండలం చెంగనపల్లె సమీపంలోని దుర్గంకొండలో బుధవారం రాత్రి చిరుత దాడి చేసి నాలుగు మేకలను చంపేసింది. గ్రామానికి చెందిన దామోదర్‌గౌడ్ తన మేకలను దుర్గం కొండలో ఉంచి మేపేవారు. రాత్రి సమయంలో మేకలను కొండపైనే మందగా వదిలారు. గురువారం ఉదయం వెళ్లి చూడగా నాలుగు మేకలు మృతి చెంది ఉన్నాయి. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మేకలు మేపే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

అంతదూరమా.. ఎవడ్రా పోయేది?

● విజయవాడ వెళ్లేందుకు జనం అనాసక్తత

చిత్తూరు రూరల్/కలెక్టరేట్, జనవరి 18: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వెళ్లేందుకు జనం అనాసక్తి చూపారు. జిల్లా నుంచీ వెళ్లే బస్సులేవీ నిండకపోవడం గమనార్హం. జిల్లా నుంచీ విజయవాడకు జనాన్ని తరలించేందుకు 38 బస్సులు కేటాయించారు. అంటే ప్రతి మండలానికి ఒక బస్సును కేటాయించారు. అంతదూరం వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. దీంతో చాలా మండలాల నుంచి ఆ ఒక్క బస్సు కూడా నిండలేదు. ఇక కుప్పం నుంచైతే ఖాళీగా వెళ్లినట్లు సమాచారం. మంత్రి పెద్దిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరులో సగం కూడా నిండలేదని తెలుస్తోంది. కాగా, విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు జిల్లా నుంచి గురువారం 38 ప్రత్యేక బస్సుల్లో సుమారు 1500 మంది వెళ్లినట్లు కలెక్టర్ షన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల విధులకు 23,288 మంది అవసరం

● ఈసీకి వివరించిన జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 18: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారుల నేతృత్వంలో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఓ వైపు సిబ్బందికి శిక్షణ ఇస్తూనే మరో వైపున ఈవీఎం యంత్రాలు, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు 23,288 మంది అవసరమని రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లా యంత్రాంగం నివేదించింది. పోలింగ్ విధులు, పర్యవేక్షణకు రిజర్వుతో కలిపి 17,358 మంది.. శాంతిభద్రతల పర్యవేక్షణ, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్ భద్రత తదితర అవసరాలకు 5930 మంది పోలీసుల సేవలు అవసరమని అభిప్రాయపడింది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, పోలీసులకు సంబంధించి తప్ప మిగిలిన అన్ని కేటగిరీల్లో తగినంత సిబ్బంది అందుబాటులో ఉన్నారని నివేదించింది. ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులను నియమించాలని సీఈసీ తీసుకున్న కీలక నిర్ణయంతో ఉపాధ్యాయులు సహా వివిధ శాఖల ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు.

కల్లూరు బడికి జాతీయ హరిత అవార్డు

● మూడోసారి కూడా పురస్కారంతో అభినందనల వెల్లువ




కల్లూరు ఉన్నత పాఠశాల ముఖద్వారం - పచ్చనిచెట్లతో ఆహ్లాదంగా పాఠశాల ఆవరణ

కల్లూరు, జనవరి 18: పులిచెర్ల మండలం కల్లూరు ఉన్నత పాఠశాల మూడోసారి జాతీయ స్థాయి హరిత పాఠశాలగా ఎంపికైంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ విభాగం నుంచి సమాచారం అందింది. ఈనెల 30న ఢిల్లీలో ఆ విభాగం డైరెక్టర్ సునీత సైరన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు. 2018-19, 2019-20లోనూ ఇదే పాఠశాలకు జాతీయ హరిత పురస్కారం లభించడం విశేషం. పచ్చని చెట్లు, పూలమొక్కలతో పాఠశాల ఆవరణం అహ్లాదకరంగా కనిపిస్తుంది. నీటిని వృథా చేయకుండా వినియోగించడం, విద్యుత్ ఆదా, చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చడం, పరిశుభ్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. కల్లూరు పాఠశాల విద్యార్థులకు దీపావళికి మట్టి ప్రమిదల వినియోగం, చవితి వేడుకల్లో ప్లాస్టిక్ అనర్థాలు, కిచెన్ గార్డెన్ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన ఇస్తుంటారు. కాగా, మూడవ పర్యాయం కూడా హరిత పాఠశాల అవార్డుకు కల్లూరు ఉన్నత పాఠశాల ఎంపిక కావడం వెనుక ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఉందంటూ నేషనల్ గ్రీన్ కోర్ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర వారిని అభినందించారు. ఎన్‌జీసీ కార్యక్రమాలను మొక్కుబడిగా కాకుండా బాధ్యతగా తీసుకోవడంతోనే అవార్డులు సొంతమవుతున్నాయని నేషనల్ గ్రీన్ కోర్ గ్రీన్ మాస్టర్ వెంకటసిద్దులు అన్నారు. ఎన్‌జీసీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి అమోఘమని హెచ్ఎం శ్రీవాణి తెలిపారు.

మంత్రి అండతో గ్రావెల్ దందా

● టీడీపీ ఇన్‌చార్జి భానుప్రకాశ్ ఆరోపణ


ఇళ్లత్తూరులో మాట్లాడుతున్న భానుప్రకాశ్

విజయపురం, జనవరి 18: విజయపురం మండలం మహారాజపురంలో గ్రావెల్ క్వారీ దందా జరుగుతోందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ ఆరోపించారు. మండలంలోని ఇళ్లత్తూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి అండదండలతో రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్రమ గ్రావెల్ క్వారీలను నడిపిస్తున్నారని విమర్శించారు. మహారాజపురం రెవెన్యూలో గ్రావెల్ క్వారీకి ఒక సర్వే నెంబరులో అనుమతి తీసుకొని ఎక్కడ గుట్టలు కనబడితే అక్కడ తవ్వేస్తున్నారని ధ్వజమెత్తారు. సర్వే నెంబర్లు 175/1, 175/2, 173/2, 175/3, 185/10లలో ప్రభుత్వం జీవనం కోసం భూ పంపిణీ చేసిన డీకేటీ భూముల్లో మట్టిని తరలించేశారని, అందులో మంత్రి, మంత్రి అన్నలు, అధికారులు పంచుకుంటున్నారని ఆరోపించారు. సర్వే నెంబరు 174/4లో డీకేటీ భూమిలో భూయజమానికి తెలియకుండా మట్టిని తరలించారని లబ్ధిదారురాలు కన్నీరు మున్నీరుగా విలపించినా అధికారుల చెవికి ఎక్కడం లేదన్నారు. మండలం నుంచి రోజుకు 600 టిప్పర్ల మట్టిని తమిళనాడుకు తరలిస్తుంటే ఏం చేస్తున్నారంటూ రెవెన్యూ అధికారులను ఆయన ప్రశ్నించారు. మండలంలో గ్రావెల్ సమస్యపై రెవెన్యూ.. పోలీసు అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా వారు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. రోజులు ఇలానే ఉండవని, కాలం మారుతుందని, గ్రావెల్ మట్టి తీసిన ప్రాంతాలను రీసర్వే చేసి ఎక్కడ ఎంత బొక్కేశారో తిరిగి కట్టాల్సిన రోజులు, అధికారులు బోను ఎక్కే పరిస్థితి వస్తుందని స్పష్టంచేశారు. ఆ రోజు ఎవరూ మిమ్మల్ని కాపాడే పరిస్థితి ఉండదని అధికారులను హెచ్చరించారు. ఇకనైనా అధికారులు తీరు మార్చుకుని గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజు, పురుషోత్తం, మునిభాస్కర్‌రాజు, గుణభూషణమ్మ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



ఎద్దుల పండుగను తిలకించేందుకు తరలివచ్చిన జనం - జనసమూహం మధ్య పరుగులు తీస్తున్న ఎద్దులు

కోలాహలంగా ఎద్దుల పండుగ

రామకుప్పం, జనవరి 18: రామకుప్పం పట్టణంలో గురువారం ఎద్దుల పండుగ కోలాహలంగా జరిగింది. స్థానిక రైతు సంఘం అధ్వర్యంలో జరిగిన ఎద్దుల పండుగను తిలకించేందుకు జనం పోటెత్తారు. మిద్దెలు, మేడలు మహిళలు, చిన్నారులతో నిండిపోయాయి. ఉదయం దిగువవీధిలోని ప్రధాన గ్రామదేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు చేసి, విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం 3:15గంటలకు రైతు సంఘం వారు రెడ్డివీధి నుంచి దేవరెద్దులను ఊరేగించి, దిగువవీధి గంగమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ దేవరెద్దులకు పూజలు చేసి, బరిలో పరుగులెత్తించారు. అనంతరం రైతులు తమ ఎద్దులను బరిలో పరుగులు తీయించారు. మెరుపు వేగంతో దూసుకెళ్తున్న ఎద్దులను యువకులు నిలువరించి, వాటికి నిర్వాహకులు కట్టిన లుంగీలను చేజిక్కించుకునేందుకు పోటీ పడ్డారు. లుంగీలను చేజిక్కించుకున్న యువకులు ఆనందోత్సాహాలంతో నృత్యాలు చేశారు. గ్రూపులుగా ఏర్పడ్డ యువకులు లుంగీలను చేజిక్కించుకునే విషయంలో పలుసార్లు వాగ్వాదం, స్వల్ప ఘర్షణ పడ్డారు. అక్కడే ఉన్న పెద్దలు జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో ఘర్షణలు సద్దుమణిగాయి.


లుంగీ కోసం ఘర్షణ పడుతున్న యువకులు

మహిళలకు ఉచిత శిక్షణా తరగతులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 18: తిరుపతిలోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం(మహిళ ప్రాంగణం)లో త్వరలో మహిళలకు టైలరింగ్, కారు డ్రైవింగ్, బ్యూటీషియన్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మేనేజరు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు సంబంధించిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆధార్‌కార్డు, 10వ తరగతి సర్టిఫికెట్, రేషన్‌కార్డు, 3పాస్‌పోర్టు సైజు ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు తిరుచానూరు రోడ్డులోని కార్యాలయంలో నేరుగా కానీ లేదా 0877-2238062నంబరును గాని సంప్రదించాలని కోరారు.

కుప్పం టీడీపీ నేత త్రిలోక్ ఆరోగ్య పరిస్థితిపై చంద్రబాబు ఆరా

కుప్పం, జనవరి 18: కుప్పం టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు త్రిలోక్ ఆరోగ్య పరిస్థితి పై టీడీపీ అధినేత చంద్రబాబు ఆరా తీశారు. కొద్ది నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన త్రిలోక్ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆరోగ్యం కాస్త కుదుట పడటంతో అతనిని కుటుంబ సభ్యులు బెంగళూరులోని నివాసానికి తరలించారు. ఇటీవల కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు బెంగళూరులోని నివాసానికి వెళ్లి అతనిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం అతడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరిగి కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుప్పం టీడీపీ నేతలు సమాచారాన్ని చంద్రబాబుకు చేరవేయడంతో అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యం అందిస్తున్న డాక్టర్లతో చంద్రబాబు మాట్లాడారు. అతడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రేపటి నవోదయ ప్రవేశపరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 18: జిల్లాలోని 14 కేంద్రాల్లో శనివారం జరిగే నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి అర్హత పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన పరీక్షల నిర్వహణ అధికారులతో సమావేశమయ్యారు. ఈ పరీక్షలకు 2347 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరంతా 20న ఉదయం 9.30 గంటలకంతా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అనువుగా ఆర్టీసీ బస్‌సర్వీసులను అధికం చేయాలన్నారు. పరీక్షాకేంద్రాలకు తనిఖీ అధికారులుగా తహసీల్దార్లు, ఎంఈవోలను నియమించామన్నారు. సమావేశంలో నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు, డీఈవో విజయేంద్రరావు, ఆర్టీసీ డీఎం రూపశ్రీ, కలెక్టరేట్ పరీక్షల విభాగ సూపరింటెండెంట్ వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.62 కోట్లు



ఐరాల(కాణిపాకం), జనవరి 18: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి హుండీ ద్వారా రూ.1,62,43,284 సమకూరినట్లు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో గురువారం స్వామి కానుకలను లెక్కించారు. 57 గ్రాముల బంగారు, 580 గ్రాముల వెండితో పాటు 964 యూఎస్ఏ, 60 ఆస్ట్రేలియా, 57 సింగపూర్, 10 కెనడా డాలర్లు, 60 ఇంగ్లాండ్ పౌండ్స్, 5 యూఏఈ దిర్హామ్స్, 1 మలేసియా రింగిట్స్, యూరో 60 యూరోలు లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.9,098 లభించినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జనసేన అభ్యర్థి నేనే : డీకే చైతన్య


మీడియా సమావేశంలో చైతన్య

చిత్తూరు సిటీ, జనవరి 18: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం మేరకు చిత్తూరు నియోజకవర్గం జనసేనకు కేటాయిస్తే తానే ఎమ్మెల్యే అభ్యర్థినని దివంగత ఎంపీ డీకే ఆదికేశవులు మనవరాలు డీకే చైతన్య చెప్పారు. గురువారం చిత్తూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈనెల 25న ఉమ్మడి మ్యానిఫెస్టో విడుదల చేస్తారని, ఆతర్వాత తన కార్యాచరణను ప్రారంభిస్తానని తెలిపారు.

మనం బోర్లలో నీళ్ళు చూస్తే ఈ తరం బాటిళ్లలో నీళ్ళు చూస్తోంది

కేంద్ర సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్


వర్క్‌షాప్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్


స్టాళ్లను తిలకిస్తున్న మహిళలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 18: మన తాతలు నదులు, కాలువలు చూస్తే, మన తండ్రులు బావులు, బోర్లు చూశారనీ, మనం బోర్లలో నీళ్ళు చూస్తే ఈ తరం బాటిళ్లలో నీళ్ళు చూస్తోందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో కట్టెల కోసం అడవికి వెళ్లినట్టు, నీటి కోసం కూడా వెళ్ళాల్సిన కాలం వస్తుందన్నారు.అందరూ ఆలోచించకపోతే భవిష్యత్తు తరాలు కన్నీళ్ళు చూసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.రాబోయే ప్రమాదాన్ని గుర్తించి రూ. 2 వేల కోట్లతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామ స్థాయిలో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఆరోగ్యకర భవిష్యత్తు దిశగా ఆరోగ్యకర గ్రామం అంశంపై తిరుపతిలోని మహిళా యూనివర్సిటీలో మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాటిల్ మాట్లాడుతూ దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్ చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు చెప్పారు.రాబోయే రోజుల్లో దేశ అభివృద్ధి ప్రణాళిక రూపొందించడానికి సర్పంచుల సూచనలు విలువైనవిగా పరిగణించే అవకాశం ఉంటుందన్నారు.అభివృద్ధి నమూనా రూపకల్పనలో సర్పంచ్ కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు.దేశాభివృద్ధిలో సర్పంచుల, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యం విలువైన చేర్పు అన్నారు.ఆరోగ్యం, ఆయుష్, స్త్రీ, శిశు అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, యువజన వ్యవహారాలు, పాఠశాల విద్య మొదలైన శాఖల కార్యదర్శుల సహకారం అవసరమని తెలిపారు. గ్రామ ఆరోగ్య ప్రణాళికను రూపొందించేందుకు వీరంతా కృషి చేయాలన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులను ఈ వర్క్‌షాప్ ద్వారా ఒక్క చోటకు చేర్చగలిగామన్నారు. మూడు రోజుల పాటు ఈ వర్క్‌షాప్‌లోని చర్చాగోష్ఠి, సమాలోచన ద్వారా భవిష్యత్తు ప్రణాళికను పటిష్టంగా రూపొందించుకునే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు,రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుడితి రాజశేఖర్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, సీఈవో ప్రభాకరరెడ్డి, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, అడిషనల్ సెక్రటరీ చంద్రశేఖర్ కుమార్, జాయింట్ సెక్రటరీ వికాస్ ఆనంద్, జేసీ శుభం బన్సాల్ తదితరులు పాల్గొన్నారు.

పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరు

హెల్త్ విలేజ్ వర్క్‌షాప్‌కు వివిధ రాష్ట్రాల నుంచి సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వైద్య అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన గ్రామాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి పటిష్టంగా అమలు చేస్తోందన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి అనేక నిర్మాణాలు చేపట్టామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించామన్నారు. పారిశుద్ధ్యం వైపు దృష్టి సారించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

వర్క్‌షాప్ ప్రాంగణంలో ఆరోగ్య గ్రామాల రూపకల్పనకు సంబంధించిన వ్యూహాలు, విధానాలు, చర్యలు, పద్ధతులు, నమూనాలను ప్రదర్శించారు. ఆప్కో వారి చేనేత వస్త్రాలు, టీటీడీ పంచగవ్య ఉత్పత్తులు, ఐసీడీఎస్ వారి పోషకాహార పదార్థాలు, డీఆర్‌డీఏ, శ్రీకాళహస్తికళంకారి, మాధవమాల కొయ్యబొమ్మలు, మహిళ రైతుల ఉత్పత్తులు, ఎర్రమరెడ్డిపాళెం రాగి పాత్రలు, విజయనగరం ప్రాంతానికి చెందిన చిరు ధాన్యాలు, నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రాంతంలో చెక్కతో తయారు చేసిన ఆహార పదార్థాలు, ఆయుష్మాన్ భారత్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రదర్శనలు వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. స్టాల్స్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి పర్యవేక్షించారు.

ప్రతినిధుల మధ్య విస్తృత చర్చ

రక్త హీనత, వయోభారంగలవారి పరిస్థితులు, అవసరాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. వీరికి అందించాల్సిన వైద్య సేవలు, ఫ్యామిలీ ప్లానింగ్‌పై చర్చించి పలు తీర్మానాలు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భిన్న వాతావరణ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి పరస్పరం చర్చించుకున్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

పుంగనూరు, జనవరి18: విద్యుత్‌ను ఆదా చేయాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగం, పొదుపుపై రెండు రోజులు అవగాహన కల్పించనున్నట్లు ఆయన వివరించారు. సోలార్ ద్వారా విద్యుత్‌ను సేకరించి వినియోగించడం వల్ల లాభాలు ఉన్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో బోరు మోటర్లు, వీధి లైట్లు పగలు కూడా వెలగడంలాంటి కార్యక్రమాలతో విద్యుత్ వినియోగం అధికమై ప్రభుత్వ సంస్థలకు అధిక భారం పడుతోందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు వెంకట్రమణ, డీఈఈలు శ్రీనివాసులు, మహేశ్, ఏఈ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మైనారిటీ నేత ఖాజాపీర్

గంగవరం, జనవరి 18: వైసీపీ ఓటమే లక్ష్యంగా జనసేన, టీడీపీ నాయకులు కలసి కట్టుగా కృషిచేయాలని టీడీపీ జిల్లామైనారిటీ అధ్యక్షుడు ఖాజాపీర్ పిలుపునిచ్చారు. గురు వారం పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం, జనసేనకు చెందిన మైనారిటీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధి ఏదైనా జరిగింది అంటే ఆది కేవలం చంద్రబాబు పాలనలోనే అని అన్నారు. రాష్ట్రంలో జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత మైనారిటీలను ఏమాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు దిలీప్, అమానుల్లా, మహబూబ్‌బాషా, రహీం, అస్లాం, నాగరాజు, శివ, ఆయాజ్, సల్మాన్, అర్షద్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ నిందితుల అరెస్టు



బైరెడ్డిపల్లె, జనవరి 18: బైక్‌ల చోరీకి పాల్పడుతున్న తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్ సమీపంలోని సత్కర్, కల్లిపేట్టై గ్రామాలకు చెందిన ఎలంగోవన్, రాజీ, దినేష్‌స్టాలిన్ అనే ముగ్గురు నిందితులను గురువారం అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు గంగవరం సీఐ కృష్ణమోహన్, బైరెడ్డిపల్లె ఎస్ఐ మోహన్ కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు... గురువారం ఉదయం వెంగంవారిపల్లె క్రాస్‌వద్ద బైరెడ్డిపల్లె ఎస్ఐ తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా పేర్నంబట్ నుంచి బైరెడ్డిపల్లె వైపు బైక్‌లో వస్తున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేయగా 20లీటర్ల నాటుసారా క్యాన్‌తో పట్టుబడ్డారు. వారిని విచారించగా బైరెడ్డిపల్లె మండలంలోని గ్రామాల్లో నాటుసారా అమ్ముతూ తిరుగుప్రయాణంలో బైక్‌లు చోరీచేసి తీసుకెళుతున్నట్లు బయటపడింది. ఆంధ్ర- తమిళనాడు సరిహద్దు అటవీప్రాంతంలో చెట్లపొదల్లో దాచివుంచిన 6 ద్విచక్రవాహనాలు, నేరాలకు ఉపయోగించిన మరో ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో వున్నారని సీఐ తెలిపారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయండి



కుప్పం, జనవరి 18: కుప్పం పట్టణంలో రెండు ప్రధాన ప్రాంతాల్లో రైల్వే లైన్‌ను దాటేందుకు ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ రైల్వే డివిజనల్ మేనేజర్ యేగేష్‌మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. గురువారం బెంగళూరులోని దక్షిణ, పశ్చిమ రైల్వే డీఆర్ఎం కార్యాలయానికి చేరుకుని కుప్పంలో అదనంగా రెండు పుష్, పుల్ రైళ్ళను వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కోసం ఎక్కువగా బెంగళూరుకు వెళ్ళి వస్తుంటారని, వీరి సౌకర్యార్థం ఉదయం 8.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు పుష్, పుల్ రైళ్ళను అదనంగా నడపాలని కోరారు. అలాగే కుప్పం మీదరుగా వెళ్ళే హటియా, దాదర్, చెన్నై మెయిల్ రైళ్ళను కుప్పంలో ఆపాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులకు కలసిన వారిలో బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్‌గౌడ్, వెంకటేష్, అరుణ, సుగుణ తదితరులు ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం

శాంతిపురం, జనవరి 18: శాంతిపురం మండలం కేపీ మిట్టకు చెందిన టీడీపీ కార్యకర్త బాబు తల్లి షబానాబీ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గౌనివారిశ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, తదితరులు షబీనాబీ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం : కెంచనబల్లలో గురువారం సురేష్‌బాబు నుంచి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. సురేష్‌బాబు ఇంట్లో నిల్వ చేసిన రూ.56వేలు విలువ చేసే మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

ఘనంగా పశువుల పండుగ







బోడివారిపల్లెలో ఊరేగుతున్న పశువులు, రాంపల్లెలో పశువుల పండుగ, అలసాపురంలో చిట్లగుంపకు నిప్పు

పుంగనూరు రూరల్, జనవరి18: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకొన్నారు. గురువారం బోడివారిపల్లె, అలసాపురం, చిన్న అలసాపురం తదితర గ్రామాల్లో ఉదయాన్నే ఇళ్లముందు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బలమ్మలను వేశారు. పశువులను ప్రత్యేకంగా అలంకరించి కొమ్ములకు ప్రభలు, బెలూన్లు కట్టి మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. సాయంత్రం నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు తరలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాటమరాజుల ఆలయం వద్దకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేసి జంతుబలులు సమర్పించి చిల్లాగుంపకు నిప్పు పెట్టి పశువులను చుట్టూ తిప్పి ఇళ్లకు తీసుకువచ్చారు.

సోమల : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పశువుల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఆవులపల్లె పంచాయతీ రాంపల్లె, కలమందలవారిపల్లె, వంగసానిపల్లె, నెల్లిమంద పంచాయతీలోని తెట్టుపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో పశువులను సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో పోటీలు నిర్వహించారు. యువకులు పశువులకు కట్టిన ప్రభలను, నగదు కానుకలను కైవశం చేసుకునేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం కాటమ రాజు ఆలయాల వద్దకు ప్రదర్శనగా వెళ్లి పూజలు జరిపి చిట్లాకుప్పల చుట్టూ ప్రదక్షణలు చేయించారు.

చౌడేపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం చౌడేపల్లె, వెంగళపల్లె, పుదిపట్ల, బత్తలాపురం, ముదిరెడ్డిపల్లె, ఎర్రప్పల్లె, జంగాళపల్లె, బీర్జేపల్లె, దుర్గసముద్రం, బుటకపల్లె, తెల్లనీళ్ళపల్లె, గాజులవారిపల్లె, 29ఏ చింతమాకులపల్లెలో పశువులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఊరేగించి, గ్రామ పొలిమేరలో చిట్లాకుప్పకు నిప్పంటించి ఆ మంటల వెలుగులో పశువులను ప్రదక్షణ చేయించారు.



వెంగళపల్లెలో ప్రత్యేకాలంకారంలో ఊరేగుతున్న పశువులు

మద్దిపట్లవారిపల్లెలో పశు వైద్యశిబిరం

రొంపిచెర్ల, జనవరి 18: వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీధర్ కోరారు. గానుగచింత పంచాయతీ మద్దిపట్లవారిపల్లెలో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించారు. 782 జీవాలకు పరీక్షలు చేసి వ్యాధులు నిర్ధయించి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్ చంద్రయ్యనాయుడు, ప్రాజెక్టు ఆఫీసర్ తేజస్విని, సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ రమణమ్మ, టీఏ రెడ్డిశేఖర్, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పుంగనూరు రూరల్, జనవరి18: మండలంలోని నేతిగుట్లపల్లెలో వాల్మీకి సంఘనాయకులు గురువారం క్యాలెండరు ఆవిష్కరించారు. విశ్రాంత డీఎస్పీ సుకుమార్ మాట్లాడుతూ వాల్మీకులు ఐకమత్యంతో ముందుకు వెళ్లడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని వాల్మీకులను ఏకతాటిపైకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీ నేత కుటుంబానికి ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 18: కెంచనబల్లకు చెందిన టీడీపీ వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రామాంజులు తల్లి విజయమ్మ గురువారం మృతి చెందారు. టీడీపీ నాయకులు మునస్వామి, రామ్మూర్తి, జేయా, చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగారెడ్డి, గుణశేఖర్ తదితరులు విజయమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు అందజేశారు.

ద్రావిడ భాషల అభివృద్ధికి ఎన్టీయార్ కృషి : వీసీ







ద్రావిడలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ఎల్లంకివారిపల్లెలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న చల్లాబాబు, సోమల బస్టాండ్‌లో ...

గుడుపల్లె, జనవరి 18: ద్రావిడ విశ్వవిద్యాలయ స్థాపనకు ఎన్టీయార్ కృషి చేశారని వీసీ కొలకలూరి మధుజ్యోతి పేర్కొన్నారు. గురువారం ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఎన్టీయార్ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ద్రావిడ భాషలకు ప్రపంచ స్థాయిలో వన్నె తేవడం కోసం కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయ స్థాపనకు ఎన్టీయార్ పూనుకున్నారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అనురాధ, రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిపురం : స్థానిక ఎన్టీయార్ సర్కిల్‌లో టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు పార్టీ శ్రేణులతో కలిసి ఎన్టీయార్ విగ్రహానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు విజయరామిరెడ్డి, నారాయణరెడ్డి, నాగరాజు, ఉయ్యాల జయరామిరెడ్డి, అనసూయ, రమేష్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు : టీడీపీ నాయకులు స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆసూరి బాలాజీ, మాధవరెడ్డి, పోలీస్ గిరి, దేశాది ప్రకాశ్, వెంకటస్వామి, కుమార్, రామయ్య, ప్రసాద్‌స్వామి, గంగాధర్, శమిపతి, మోహన్,నౌషాద్, సద్దాం, జనసేన నాయకులు చిన్నారాయల్, నరేశ్‌రాయల్, చైతన్య, సుబ్బు పాల్గొన్నారు.

కల్లూరు : పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, కల్లూరులలో గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతి నిర్వహించారు. ఎల్లంకివారిపల్లిలో చల్లా రామచంద్రారెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, వెంకటరమణ, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, గోపినాయుడు, మురళీధర్‌నాయుడు, కుమార్‌రెడ్డి, రవి, దేవ, చెంగల్రాయనాయుడు, సుదర్శన్‌నాయుడు, సురేష్, నాగరాజు, అన్వర్‌బాషా, రాజేష్ పాల్గొన్నారు.

సోమల: సోమల బస్టాండ్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు జరిపారు. అలాగే కమ్మపల్లెలో వర్ధంతి జరిపారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు సి. సుబ్రహ్మణ్యం నాయుడు, రమేశ్ నాయుడు, కొల్లా హరిప్రసాద్, సతీశ్, శివశంకర్, చినబాబు, రమణయ్య, సుబ్బరాయులు, బి.శ్రీనివాసులు, విశ్వనాథం, రఘు, రెడ్డిశేఖర్, బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్లలో రామారావు చిత్రపటానికి చల్లాబాబుతో కలిసి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉయ్యాల రమణ చింతపర్తి ఓబులేశ్వరరెడ్డి, షేక్ కరీముల్లా, జి.ఇమ్రాన్‌ఖాన్, అంజాద్‌ఖాన్, నాగరాజ, శశికుమార్, సహదేవ, గూడురుహరిబాబు, శిద్దయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పంలో టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం వారు పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అన్ని పంచాయతీ కేంద్రాల్లో గ్రామకమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఎన్టీయార్ వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మునస్వామి, పత్రనారాయణాచారి, చలపతి, ఆనందరెడ్డి, నరసింహులు, అంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండు వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపాలశ్రీనివాసులునాయుడు, బోయకొండ సుబ్బు, కుమార్‌రెడ్డి, ప్రభాకర, రమణ, మునెంకటప్ప, కల్యాణ్, నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వి.కోట : పట్టణంలోని ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు రంగనాథ్, ఈశ్వర్, రామచంద్ర నాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం : పేదలకు అనేక అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన నాయకుడు దివంగత నందమూరి తారకరామారావు అని కుప్పం టీడీపీ ఇన్‌చార్జి పీ.ఎస్.మునిరత్నం అన్నారు. గురువారం కుప్పం ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే మిట్టపల్లెలో రూరల్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గోపినాథ్, సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, ప్రతాప్, అనసూయమ్మ, ముకేష్ రవికుమార్, అన్సర్, ఉమాపతి, నాను ఉన్నారు.

గంగవరం : పలమనేరు మార్కెట్ యార్డ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్‌బీసీ కుట్టి, నాగరాజురెడ్డి, సుబ్రమణ్యం గౌడ్ బ్రహ్మయ్య, నాగరాజు, చిన్ని, ఖాజా శ్రీధర్, అమరనాథ్ రెడ్డి, అఫ్రోజ్, మాబాష, శ్రీనివాసులు, మంజునాథ్, గణేష్, వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే గంగవరంలో ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సోమశేఖరగౌడ్, ప్రతాప్‌రెడ్డి, వెంకట్రమణారెడ్డి, వెంకటేష్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, హరిబాబు, యుగంధర్ నాయుడు, మొగిలిరెడ్డి, మురళి, ఆనంద్, గిరిదర్ గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.





రామకుప్పం, చౌడేపల్లె, శాంతిపురంలో ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



కుప్పంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు



పలమనేరులో ...



వి.కోటలో అన్నదానం



రొంపిచెర్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు



పుంగనూరులో ...



ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసినా సమ్మె విరమించే ప్రసక్తే లేదు







బైరెడ్డిపల్లె, కుప్పంలలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు, పలమనేరులో మాట్లాడుతున్న అనుబంధ సంఘ నాయకులు

గంగవరం, జనవరి 18 : ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసినా సమ్మె మాత్రం విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీల అనుబంధమైన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సమరశీల నాయకులు తేల్చిచెప్పారు. పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ముందు 38వ రోజు గురువారం అంగన్వాడీల సమ్మెకు అనుబంధ సంఘ నాయకులు మద్దతు పలికి ప్రసంగించారు. 38రోజులనుంచి అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించమని సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అంగన్వాడీలను వేధింపులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి అవలంభిస్తే నిరాహార దీక్షలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు సురేష్, వినోద్, ప్రకాష్, కృష్ణమూర్తి, సుబ్రమణ్యం, చంద్రారెడ్డి, ప్రసన్నకుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: తమ సమస్యల పరిష్కారానికై అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 38వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గురువారం కూడా బైరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కొనసాగించారు. తమ అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించే ప్రసక్తేలేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు.

కుప్పం : కుప్పంలో గురువారం అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. ప్రభుత్వం అంగన్వాడీలకు నేరుగా నోటీసులు ఇవ్వలేక తమ గోడలకు అతికించడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సమ్మెవిరమించేది లేదన్నారు.

పుంగనూరులో పారిశుధ్య పనులు

పుంగనూరు రూరల్, జనవరి 18: మురుగు కాల్వలు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయిస్తూ బయట ప్రాంతాలకు తరలిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తెలిపారు. గురువారం పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో మురుగు కాల్వల్లో నిలచిన నీటిని సెప్టిక్ ట్యాంకుల ద్వారా తరలిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో కాల్వల్లో మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పుంగనూరు మున్సిపాలిటీకి మూడు సెప్టిక్ ట్యాంకులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంజూరు చేయించినట్లు తెలిపారు. సెప్టిక్ ట్యాంకుల డ్రైవర్లు విజయకుమార్ ఫోన్ నెంబరు 8074152690, నాగరాజ ఫోన్: 9963976521, రెడ్డిశేఖర్ ఫోన్: 9177062164 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీవిత సత్యాలు తెలపడంలో వేమన పద్యాలు కీలకం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

గంగవరం, జనవరి 18: వేమన పద్యాలు జీవిత సత్యాలను తెలియజేయడంలో కీలకమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. గురువారం వేమన జయం తిని పురస్క రించుకుని కళా మందిరంలో ముందస్తుగా వేమన పద్యాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేమన పద్యాలలో నీతి అంతర్లీనంగా ఉండి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉంటుందన్నారు. వేమన పద్యంరాని తెలుగువారు లోకంలో ఎవరూ ఉండరనడంలో సందేహం లేదన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయినుంచే వేమన పద్యాలను చదవడం అలవరచడం వలన పిల్లలు క్రమశిక్షణతో నీతి నియమాలతో విద్యపై మంచి పట్టు సాధించే అవకాశముందన్నారు. అందుకే అప్పుడప్పుడు విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సహించడం జరుగుతున్నదన్నారు. అనంతరం పద్యాలలో రాణించి ప్రతిభ కనబరచిన 50 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, పుస్తక బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, జొన్నవిత్తుల శ్రీరామమూర్తి, దేవకుమారి, చంద్రశేఖరయ్య, వాణి, ధనంజయ, మునిరత్నంరెడ్డి, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్మారక పురస్కారాలు ప్రదానం

స్థానిక కళామందిరంలో గురువారం తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్వర్యంలో స్మారక పురస్కారాలను గురువారం ప్రదానం చేశారు. పైనేని చిన్నబ్బనాయుడు స్మారక జాతీయ పురస్కారాన్ని బెంగళూరుకు చెందిన సామాజిక సేవకులు ధనంజయ్ రామకృష్ణకు, వి.బసయ్య స్మారక జాతీయ పురస్కారాన్ని ప్రముఖ రచయిత బత్తనపల్లె మునిరత్నంరెడ్డికి తులసీనాథం నాయుడు, పుష్ప దంపతులు పురస్కారాలను ప్రదానం చేశారు. కళామందిరంలో ఇలాంటి మంచి కార్యక్రమాలను చేపట్టడం చాలా హర్షనీయమని పురస్కార గ్రహీతలు కొనియాడారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న పలువురు నేతలు



భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

విజయపురం, జనవరి 18: టీడీపీకీ పూర్వ వైభవం వస్తుందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్త ఇళ్ళత్తూరులో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భానుప్రకాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇళ్ళత్తూరు పంచాయతీ నుంచి వైసీపీ, కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు సుమారు 15 మంది భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వినోద్, బాలకృష్ణ, సురేశ్, గిరి, మునిచంద్ర, వెంకటస్వామిరాజు, రమేశ్, ప్రకాశ్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, మునిభాస్కర్‌రాజు, మునిరాఘవరాజు, దశరథరాజు, గుణభూషణమ్మ, గజేంద్ర, కృష్ణమరాజు, ఏళుమళై, ఆర్ముగం, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

ఐరాల, జనవరి 18: ఐరాల మండలం నాగంవాడ్లపల్లెలో కొన్ని కుటుంబాలు మినహా గురువారం అందరూ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, జనసేన నాయకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామస్తులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామంలో టీడీపీకి పూర్వ వైభవం వచ్చిందన్నారు. నియోజకవర్గంలో ఈ ఎన్నికలలో టీడీపీ విజయం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు కలసి ఎన్నికలలో దిగుతాయన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ లత, మాజీ ఎంపీపీ శాంతమ్మ, హరిబాబు నాయుడు, మణి నాయుడు, మధుసూదన్‌రావు, కోదండయాదవ్, కొల్లారమేష్, సభాపతి, జనసేన నాయకులు తులసీప్రసాద్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మన ఊరు అభివృద్ధి



వేనూతనపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న మురళీమోహన్

పూతలపట్టు, జనవరి 18: తెలుగుదేశం పార్టీతోనే మన ఊరు అభివృద్ధి చెందుతుందని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని వేనూతనపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు అక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా రచ్చబండపై కూర్చొని ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్నో రకాల రుణాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. జగన్ సీఎం అయ్యాక ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులన్నీ తమ ఖాతాలోకి వేసుకుని దళితులకు చిల్లిగవ్వకుండా ఇవ్వకుండా ద్రోహం చేశారని విమర్శించారు. వైసీపీకి కంచుకోటగా వున్న వేనూతనపల్లి దళితవాడ ప్రజలు మురళీమోహన్‌ను ఆహ్వానించడంతో టీడీపీ నేతల్లో నూతన ఉత్సాహం కలిగింది. వైసీపీకి చెందిన కార్యకర్తలు అయనతో మాట్లాడుతూ చంద్రబాబు సంక్షేమ పథకాలు తమకు బాగా నచ్చాయని కొనియాడటంతో మురళి ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి. ఈ కార్యక్రమంలో నాయకులు హేమాద్రి, నాగయ్య, దాము, మునిరాజు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు కాదు... జీవో కావాలి



నిరవధిక సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు

కార్వేటినగరం, జనవరి 18: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న నిరధిక సమ్మె 38వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇవ్వడం కాకుండా జీవోను విడుదల చేసి తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

- తప్పిన ప్రమాదం



విద్యుత్ స్తంభాన్ని నిలబెడుతున్న అధికారులు

కార్వేటినగరం, జనవరి 18: పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని గురువారం తెల్లవారుజామున వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే విద్యుత్ స్తంభం కూలడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. 9గంటల తరువాత విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసి, సరాఫరాను పునరుద్ధరించారు.

22న పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 18: అయోధ్య శ్రీరామ మందిరం, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఈనెల 22న జిల్లాలోని పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో రాష్ట్ర విద్యాశాఖను కోరారు. అదే రోజున పాఠశాలలు పునఃప్రారంభం చేయడం సరికాదన్నారు. కాగా అయోధ్య రాముడి అక్షింతలను ఎగతాళి చేస్తూ రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడం సరికాదన్నారు. మంత్రి తెలుగు రాష్ట్రాల ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 22న పాఠశాలలకు సెలవు ప్రకటించాలని బీజేపీ నాయకులు చిట్టిబాబు విద్యాశాఖ అధికారులకు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆ రోజున ప్రభుత్వం సెలవు దినం ప్రకటించకుంటే, తల్లిదండ్రుల సహకారంతో జిల్లాలోని విద్యా సంస్థలు మూసి వేస్తామని ఆ ప్రకటనలో విద్యాశాఖ కమిషనర్‌ను హెచ్చరించారు. కాగా శ్రీరామ మందిరం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ రోజున ప్రతి ఒక్కరూ ప్రత్యక్ష ప్రసారం ద్వారా కార్యక్రమంలో భాగస్వాములు కావడానికిగాను 22న పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక ఆదాయం

వెదురుకుప్పం, జనవరి 18: మామిడిలో యాజమాన్య పద్ధతులను పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభం పొందవచ్చని, నాణ్యమైన దిగుబడులు వస్తాయని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం వెదురుకుప్పం రైతు భరోసా కేంద్రంలో మామిడికి పూత దశ నుంచి కోత దశ వరకు చేపట్టాల్సిన చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మామిడి పంట ఎక్కువగా సాగవుతుందన్నారు. భూసారానికి సంబంధించి వ్యవసాయ అధికారులు, ఉద్యాన పంటల్లో చేపట్టాల్సిన చర్యల గురించి ఉద్యాన శాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తే మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఉద్యాన పరిశోధన స్థానం(మదనపల్లి) శాస్త్రవేత్త బాలహుస్సేన్, ఏరువాక శాస్త్రవేత్త నాగమణి, మండల ఉద్యాన అధికారి వింధ్య, మండల వ్యవసాయాధికారి వనిత, జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్, మండల రైతుసంఘ అధ్యక్షులు పెద్దిరెడ్డిగారి ఉమాచంద్రారెడ్డి, రైతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నగరిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భానుప్రకాష్, టీడీపీ నేతలు



చిత్తూరులో, బీఎన్ఆర్ పేట క్రాస్ వద్ద, పెనుమూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

● పలు చోట్ల అన్నదానం

చిత్తూరు సిటీ, జనవరి 18: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌కు ఆపార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఉదయం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డీసీసీబీ కార్యాలయం, జడ్పీ కార్యాలయాలలోని ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. మధ్యాహ్నం ఎన్టీఆర్ సర్కిల్‌తో పాటు పలు డివిజన్లలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, కోదండయాదవ్, కాజూరు బాలాజి, కటారి హేమలత, గురజాల జగన్మోహన్, సీఆర్ రాజన్, బద్రీనారాయణ, సప్తగిరి ప్రసాద్, వెంకటేష్ యాదవ్, త్యాగరాజన్, సీఎం విజయ, మోహన్‌రాజ్, హేమాద్రి నాయుడు, కాజూరు రాజేష్, అరుణ, జనసేన నేతలు ఆరణి కవిత, దయారాం తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో బీఎన్‌ఆర్ పేట క్రాస్ వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, దేవరాజులు నాయుడు, రఘు, మేషాక్, నీలకంఠం నాయుడు, ఆనందనాయుడు, కుమార్, గిరి, జాఫర్, మనోహర్ నాయుడు, రెడ్డప్ప, బుజ్జి, సురేష్, బాలకృష్ణ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదమరి: యాదమరిలో జరిగిన కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు వల్లేరు అమరనాథ నాయుడు, హేమగిరి, రాజమాణిక్యం, గుణశేఖర్, సుభాష్ నాయుడు, లక్ష్మీపతి, మునీర్, శివాజీ, చిత్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

పాలసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు అరుళ్‌నాథన్, సాంబశివన్, వెంకటేశులు నాయుడు, బుజ్జి నాయుడు, చిరంజీవులు, తంగరాజ్, భక్తవత్సలం నాయుడు, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె: తవణంపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీలు వెంకటేష్‌చౌదరి, కోదండయ్య, మాజీ ఎంపీపీ సరళకుమారి, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్ కుమార్, టి.పుత్తూరు సర్పంచి రవిచంద్రారెడ్డి, స్థానిక సర్పంచి ధనలక్ష్మి, నాయకులు శరవణ, దాము, భాస్కర్‌యాదవ్, చిట్టెమ్మ, గోపి, మణి, లవకుమార్, శ్రీధర్, నాగరాజ, శంకర్, షబ్బీర్ అలీ, జయపాల్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రయ్య నాయుడు, హరిబాబు నాయుడు, ఈశ్వర్ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, తలారి రెడ్డెప్ప, భాస్కర్, కిషోర్ నాయుడు, ఎన్ఎస్ నాయుడు, యువరాజులు నాయుడు, నాయకులు పాల్గొన్నారు. అలాగే జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పొన్న యుగంధర్, మండల అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూడా నిర్వహించారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరులో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టీడీపీ యాదవసాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, నేతలు చిన్నస్వామి, దేవసుందరం పాల్గొన్నారు. అదేవిధంగా తూగుండ్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీసెల్ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, నాయకులు నరసింహులు నాయుడు, జీవరత్నం, శాంతకుమార్, జ్యోతి యాదవ్, నీరజాక్షులురెడ్డి, మార్కొండ నాయుడు, అశోక్ నాయుడు, లోకనాధం యాదవ్, చిట్టినాయుడు, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. తూగుండ్రంలో 400మందికి అన్నదానం చేశారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు దాము, నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, రాజశేఖర్ నాయుడు, బాలాజీ నాయుడు, సిద్దయ్యశెట్టి, కుమార్, చంద్రబాబు నాయుడు, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం గాండ్ల మిట్ట కూడలి వద్ద, ఆర్‌కేవీబీపేటలో జరిగిన కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షులు చెంగల్‌రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి జనార్ధన్ రాజు, చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు నాగేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రమైన వెదురుకుప్పం, పచ్చికాపల్లంలో నిర్వహించిన కార్యక్రమాల్లో టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి, నేతలు బట్టే చాణిక్యప్రతాప్, గాలి బాబు నాయుడు, బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, శివరాం యాదవ్, మోహన్‌యాదవ్, పి. మోహన్‌మురళీ, యుగంధర్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం. రాజశేఖర్‌వర్మ, భాస్కర్ నాయుడు, లోకనాథరెడ్డి, మల్లికార్జున యాదవ్, షణ్ముగరెడ్డి, జానకిరాం యాదవ్, మునికృష్ణయ్య, మధు, జయచంద్ర, గురునాథం పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టులో జరిగిన కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు కాంతారావు, గణపతి నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, నేతాజీ, విజయలక్ష్మి, గిరిధర్ బాబు, హరి, గంగారపు హరి, సుబ్బరాజులు, బాలక్రిష్ణమ నాయుడు, చిరంజీవి, ప్రతాపనేని చంద్రమౌళి, లత, గురుస్వామి, ప్రమోద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ ఎన్ఆర్ఐ నేత ఊట్ల శ్యామసుందర్ రావు తమ సొంత నిధులతో గురువారం నుంచి నిత్యం అన్నాక్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఆయన తల్లిదండ్రులు ఊట్ల నాగరాజ నాయుడు, ఊట్ల సుగుణమ్మ, బావ హేమాద్రి నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటిరోజు సుమారు 700 మందికి పైగా అన్నదానం చేశారు.

నింద్ర: నింద్రలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయకుమార్, నాయకులు రవి నాయుడు, చిట్టిబాబు, బాబు యాదవ్, ఆనందరాజు, రఘుయాదవ్, సుబ్బారావు, మురళీ నాయుడు, పరదేశి, కోటేశ్వరరావు, మనోహర్ నాయుడు, మనోజ్‌యాదవ్, ప్రసాద్‌రెడ్డి, కాటయ్య, వెంకటరత్నం నాయుడు, సంపూర్ణమ్మ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని అగరంపల్లె, ఐరాలలో జరిగిన కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, పార్టీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ లత, మాజీ ఎంపీపీ శాంతమ్మ, మణి నాయుడు, మధుసూదన్‌రావు, హేమాద్రి నాయుడు, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



అగరంపల్లెలో అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్

బంగారుపాళ్యం: బంగారుపాళ్యం, శేషాపురంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ఎన్‌పీ ధరణి నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, కుప్పాల మురళి, కమల్‌నాథ రెడ్డి, వాసుదేవ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, జనార్ధన్ గౌడ్, చంద్రయ్య నాయుడు, లోకనాథం నాయుడు, వెంకటప్ప బోయడు, రమేష్, వంశీ, హరిప్రసాద్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు. అన్నా క్యాంటీన్‌లో రామానాయుడు పాళ్యంకు చెందిన రెడ్డెప్ప నాయుడు కుమారుడు ఎన్ఆర్ఐ భరత్ చౌదరి అన్నదానం చేశారు. బోడబండ్లలో ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్‌తో కలసి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నగరి: నగరి పట్టణం, మండల పరిధిలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్, పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు బాలాజీ, మీరా, కృష్ణారెడ్డి, గుణశేఖర్, ఖదర్‌బాయ్, పురుషోత్తం నాయుడు, అల్లిముత్తు, అశోక్, రజనీకాంత్ కన్నయ్య, నారాయణస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు. కొత్తపేటలో వీకేఎస్ వాసు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గుడిపాల: గుడిపాలలో జరిగిన కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు హేమాద్రి నాయుడు, చంద్రమోహన్, అనిల్‌కుమార్, చెన్నకేశవులు నాయుడు, మురళీ నాయుడు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, గుర్రప్ప నాయుడు, జయదేవ నాయుడు, పీటర్, చల్లా, జయరామ్ యాదవ్, ధనసింగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాలసముద్రం మండలం బలిజకండ్రిగలో, బంగారుపాళ్యం మండలం శేషాపురం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి, గుడిపాలలో, తూగుండ్రంలో, తవణంపల్లెలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు



నింద్రలో, ఎస్ఆర్‌పురంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు, యాదమరిలో, వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చిత్తూరు, జనవరి 18: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు వివరాల మేరకు... నగరంలోని ఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి నడిచి వెళుతున్నాడు. బస్టాండు నుంచి గాంధీ విగ్రహం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు నేరుగా అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద మొబైల్‌ఫోన్ గాని లేదా ఏ ఇతర ఆధారాలు లేవు. మృతుడు చేతికి ఉంగరం, బ్లూగళ్లచొక్కా, నీలం కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. కాగా మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని పోస్టుమార్టం రూముకు తరలించారు. మృతుడి వివరాలను తెలిసిన వారు 9491074515 నెంబరుకు తెలియజేయాలని సీఐ కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

● చిత్తూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీలో మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బంగారుపాళ్యం, జనవరి 18: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని తంబుగారిపల్లె డాబా వద్ద గత కొంతకాలంగా గుర్తుతెలియని వ్యక్తి (35) భిక్షాటన చేస్తూ ఉండేవాడు. ఈనెల 15వ తేదీ రాత్రి డాబా పక్కన అతడు స్పృహ కోల్పోయి ఉండగా, స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా, వారు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి అతడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తి నీలిరంగు గళ్ల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఇతడి కుడికాలికి దెబ్బతగిలి కట్టుకట్టుకొని ఉన్నాడు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఇతడి వివరాలను గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

గంగమ్మ ఆదాయం రూ.4.48 లక్షలు



హుండీలో నగదును లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీరంగరాజపురం, జనవరి 18: ఎస్ఆర్‌పురం మండలం ఆరిమాకులపల్లెలో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయంలో గురువారం ఈవో సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.4లక్షల 48వేలు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోతరంగనపల్లె వద్ద కాలేజి బస్సు బోల్తా

● అద్దాలు పగలగొట్టి విద్యార్థులను బయటకు తీసిన గ్రామస్తులు



బోల్తా పడిన బస్సు

గంగాధరనెల్లూరు, జనవరి 18: మండలంలోని మోతరంగనపల్లె బస్టాప్ సమీపంలో చిత్తూరుకు చెందిన శ్రీవివేకానంద జూనియర్ కాలేజి బస్సు బోల్తా పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు. స్థానికుల కథనం మేరకు వివరాలు... చిత్తూరు నగరానికి చెందిన శ్రీవివేకానంద జూనియర్ కాలేజికి చెందిన బస్సు గురువారం ఉదయం శ్రీరంగరాజుపురం, గంగాధరనెల్లూరు మండలాల్లోని వివిధ గ్రామాల దగ్గర విద్యార్థులను ఎక్కించుకుని చిత్తూరుకు వస్తుంది. ఈ క్రమంలో గంగాధరనెల్లూరు మండలంలోని మోతరంగనపల్లెలో గుడి దాటుకుని చిత్తూరు వైపు వస్తున్న బస్సు ఉన్నట్టుండి రోడ్డుపక్కన బోల్తాపడింది. ఆ బస్సులో సుమారు 28మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో శ్రీరంగరాజుపురం మండలం చిన్నబాపనపల్లెకు చెందిన చైతన్య, దీప, గాయత్రి, గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లెకు చెందిన రాఘవేంద్రలకు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు. మిగిలిన రోజుల్లో ఈబస్సులో విద్యార్థులు 50మంది దాకా కాలేజికి వెళుతుండేవారని, సంక్రాంతి పండగ కారణంగా తక్కువమంది విద్యార్థులు బస్సులో రావడంవల్ల పెనుప్రమాదం తప్పిందని విద్యార్థులు, స్థానికులు పేర్కొన్నారు. కాగా బస్సు డ్రైవర్ మాత్రం స్టీరింగ్ తిరగకపోవడంవల్ల ప్రమాదం జరుగుతుందని భయపడి కాలు, చేతి బ్రేక్‌లు రెండు వేయటంవల్ల బస్సుబోల్తా పడి పెద్దగా ప్రమాదం చోటుచేసుకోలేదని వివరణ ఇచ్చినట్లు ఎస్ఐ రామాంజనేయులు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తాం

● వాహనదారులచే ప్రతిజ్ఞ చేయించిన రవాణాశాఖ అధికారులు

చిత్తూరు సిటీ, జనవరి 18: రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని వాహనదారుల చేత రవాణా శాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం నగర శివారులోని ఇరువారం వద్ద బస్సు, లారీ, ఆటో, ద్విచక్రవాహన దారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐలు మాట్లాడుతూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని అన్నారు. మానవ తప్పిదాల వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను చాలావరకు నివారించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, టీఎన్ మురళి, దీపిక, హైవే పెట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాలు కోల్పోయిన దళిత యువకుడి కుటుంబానికి రూ. కోటి ఆర్థిక సాయం చేయాలి: టీడీపీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 18: దళితబిడ్డ ప్రాణం ఖరీదు రూ.5 లక్షలా....? ఎంత దారుణం, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయిందని, వారి కుటుంబానికి రూ. కోటి ఆర్థిక సాయం చేయాలని జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ నేతృత్వంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషాక్, చిత్తూరు నగరపార్టీ ఉపాధ్యక్షుడు బాబు రెడ్డి తదితరులు కలెక్టరేట్‌లో జేసీ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. యాదమరి మండలం కీనాటంపల్లిలో ఇంటర్ చదువుతున్న అభి (17) అనే యువకుడు విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి ప్రాణాలు కోల్పోయాడన్నారు. అతడికి ప్రభుత్వం కేవలం రూ.5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. దళితబిడ్డ ప్రాణం విలువ రూ.5 లక్షలేనా...? అని వారు ఆ వినతిపత్రంలో ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంతజిల్లాలో విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు దారుణంగా ఉందన్నారు. విశాఖలో ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ కారణంగా మరణించిన మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి... దళిత బిడ్డ అభి మృతికి రూ.5 లక్షలు మాత్రమే చెల్లించడం దారుణమన్నారు. అతడి కుటుంబానికి ఐదెకరాల ప్రభుత్వ భూమి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన జేసీ యాదమరి తహసీల్దార్‌తో మాట్లాడి ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి కేటాయిస్తామని హామీయిచ్చినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి

నింద్ర, జనవరి 18: మండలంలో ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని పంచాయతీరాజ్ డీఈ సుబ్బరాయులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సెక్టోరియల్ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇంజనీరింగ్ అసిస్టెంట్ విధిగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు లేని కేంద్రాలను గుర్తించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అరుణ, ఎంఈవో శ్రీధర్‌రాజు, సెక్టోరియల్ అధికారులు తులసి, అంజేరయ్య, పంచాయతీరాజ్ ఏఈ వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ

ఐరాల(కాణిపాకం), జనవరి 18: రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాణిపాకం పంచాయతీ కార్యదర్శి సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన

చిత్తూరు, జనవరి 18: ఈవీఎంలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కమిషనర్ అరుణ చెప్పారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా ఈవీఎంలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారంతా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఏసీ గోవర్ధన్, ఏసీపీ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో లోకేష్, డీఈ రమణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దాం

వెదురుకుప్పం, జనవరి 18: టీడీపీ గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేద్దామని పార్టీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ పిలుపునిచ్చారు. గురువారం వెదురుకుప్పం టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది.